క్లుప్తంగా

అలకారప్రాయంగా సెంట్రల్ లైటింగ్



దాచేపల్లి: సెంట్రల్ లైటింగ్ అలంకారప్రాయంగా నిలిచింది. నడికుడి– నాగార్జున సాగర్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద అద్దంకి– నార్కెట్‌పల్లి హైవేని అనుసంధానం చేస్తూ ఒకటి, నడికుడి టర్నింగ్ పాయింట్ వద్ద మరోకటి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. నాలుగు నెలల క్రితం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తే ఇప్పటి వరకు వీటిని వెలిగించలేదు. ఈ లైటింగ్ ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. సెంట్రల్ లైటింగ్ వెలిగితే కొంత వరకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆరికట్టవచ్చు.

మాజీ మంత్రి రజినిపై దాడి హేయం

కారెంపూడి: మాజీ మంత్రి విడదల రజినిపై దాడి బీసీ, బడుగు బలహీన వర్గాలపై జరిగిన దాడి గా వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి అని కూడా చూడకుండా కనీసం మహిళకు ఇవ్వాల్సిన గౌరవం కూడా ఇవ్వకుండా సీఐ సుబ్బానాయుడు వ్యవహరించిన తీరు జుగుప్సాకరమన్నారు. సీఐపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి జాన్‌పాల్ నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య, మామిడి శేఖర్, బొంకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శాంతిబాయికి ఐడియల్ మదర్ అవార్డు



మాచర్ల: ప్రపంచ స్థాయి సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక అందిస్తున్న ఐడియల్ మదర్ అవార్డును శాంతిబాయి అందుకున్నారు. ఏలూరు మహాలక్ష్మి కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన మాతృదేవోభవ కార్యక్రమంలో ఆ సంస్థ సీఈఓ కత్తి మండ ప్రతాప్ అందించారు. డాక్టర్ సాంబేలు శాంతిబాయి, ముగ్గురు ఆడపిల్లల్ని చక్కగా చదివిస్తూ స్టేట్, జిల్లా ర్యాంకులు సాధించడానికి ఎంతో ప్రోత్సాహం అందించినట్లు కొనియాడారు. ఉత్తమ ఉపాధ్యాయురాలి, సమాజ సేవకురాలిగా, రచయితగా, యూనియన్ లీడర్‌గా 14 సంస్థల్లో ముఖ్యపాత్రను పోషిస్తూ నేటి యువతరానికి ఎంతో ఆదర్శంగా నిలుస్తున్న మాతృమూర్తి అని ఆమెను అభినందించారు. కార్యక్రమంలో రమాదేవి, ఈశ్వరి భూషణం, లలితా శ్రీ, పార్థసారథి, కృష్ణకుమారి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాలు

గురజాల: మండల పరిధిలోని చర్లగుడిపాడులోని సాక్షి వేణుగోపాల స్వామి వార్షిక కల్యాణ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ధ్వజారోహణ, బిందు సేవ, వాస్తు హోమం, సాయంత్రం సమయంలో నిత్య హోమం, బలిహరణ, దేవత ఆహ్వాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో శోభయానంగా తీర్చిదిద్దారు. స్వామి వారి దేవాలయం నిర్మాణంలో భాగంగా బొడ్డు రామకృష్ణ ఆర్థిక సాయం అందించారు.

వ్యవసాయ పంపుసెట్ల కేబులు చోరీ

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలోని పంట పొలాల్లో వ్యవసాయ పంపుసెట్ల కేబుల్ వైర్ల చోరీ ఘటన వెలుగు చూసింది. గోగులపాడు గ్రామానికి చెందిన బొల్లా వెంకటేశ్వర్లు పొలంలో వ్యవసాయ పంపుసెట్లు ఉన్నాయి. ఈ పంపుసెట్లకు సంబంధించి 130 మీటర్లకు పైగా కేబుళ్లను ఈ నెల 9వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. అపహరణకు గురైన కేబుల్ వైర్ల ఖరీదు రూ.50 వేలకు పైగా ఉంటుందని బాధితుడు తెలిపారు. ఈ మేరకు రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. అయితే ఇదే పొలంలో రెండు నెలల క్రితం వ్యవసాయంలో ఉపయోగించే స్ప్రింక్లర్లు, మోటార్ల కేబుళ్లు కూడా అపహరణకు గురయ్యాయి.

ముగిసిన యోగా శిక్షణ శిబిరం

నరసరావుపేట రూరల్: శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో రావిపాడు రోడ్డులోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న యోగా శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. యోగాచార్యులు జల్లి శ్రీనివాసరావు, కూనిశెట్టి వెంకటజనార్దన్ గురూజీ, బత్తుల మురళి, గంగూరి శ్రీనివాసరావు అతిథులుగా పాల్గొన్నారు. వెంకటేశ్వర యోగి గురూజీ అనుగ్రహ భాషణ ఆశీర్వచనాన్ని చరవాణి ద్వారా అందించారు. శిబిరానికి గైర్హాజరు కాకుండా పాల్గొన్న అభ్యాసకులకు జ్ఞాపికలు అందజేశారు. శ్లోకాలు పదిసార్లు రాసి అప్పజెప్పిన వారికి ప్రతిభా పురస్కారాలు అందించారు.

ముమ్మర తనిఖీలు



బస్టాండ్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు



రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

పిడుగురాళ్ల: జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో ముమ్మరంగా సోదాలు చేశారు. ఈసందర్భంగా ఎస్‌ఐ నాగరాజు మాట్లాడుతూ... అనుమానితంగా ఉన్న ప్రాంతాలు, జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకొని రావాలని అధికారులు ప్రజలకు సూచించారు. కొత్త వ్యక్తులను అపార్టుమెంట్‌లు, కాలనీలోకి రానివ్వకుండా కాలనీ సభ్యులు దృష్టి సారించాలని చెప్పారు. కొత్త వ్యక్తులకు ఇళ్లను అద్దెకు ఇవ్వకూడదని, ఇచ్చినా వారి కదలికలను గమనిస్తుండాలని పేర్కొన్నారు.

వైభవం.. నృసింహ జయంత్యుత్సవం



చందనాలంకరణలో శ్రీయోగానంద నృసింహుడు



శ్రీరాధ గోవిందులు...



ప్రత్యేక అలంకరణలో శ్రీరాజ్యలక్ష్మీ సమేత శ్రీనారసింహుడు

- బరంపేట శ్రీరాధ గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు
- పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు

నరసరావుపేట ఈస్ట్: శ్రీనారసింహ చతుర్దశిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలో నృసింహ జయంత్యుత్సవం వైభవంగా నిర్వహించారు. బరంపేటలోని శ్రీరాధ గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయంలో శ్రీనారసింహ ఆవిర్భావ దినోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉదయం ఆలయంలోని శ్రీరాధ గోవిందుల మూలమూర్తులకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే శ్రీరాజ్యలక్ష్మీ సమేత శ్రీనారసింహస్వామి ఉత్సవమూర్తులకు అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు మహా శంఖాభిషేకం, మహారాజ భోగ నివేదంచి భక్తులకు ప్రసాదాలు అందచేశారు. అలాగే సత్తెనపల్లిరోడ్డు పులుపుల వారి వీధిలోని శ్రీవీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీనారసింహస్వామి వారి దేవస్థానంలో నృసింహ జయంతిని పురస్కరించుకొని స్వామివారు చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం స్వామివారి పూలంగి సేవలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి

వినుకొండ: పట్టణంలోని కొండ మెట్లవద్దనున్న పురాతన లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 108 మంది మహిళలు పొంగళ్లతో ఊరేగింపుగా దేవాలయం వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయం కమిటీ నాయకులు జాజుల మాల్యాద్రి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. న్యాయవాది పోట్లూరి సైదారావు, సనిశెట్టి లక్ష్మీనారాయణ, జెట్టి శ్రీను, కె.అనంత కోటేశ్వరరావు, బద్దిక వెంకట నరసింహారావు, కాకుమాను రామారావు, విశ్వరూపాచారి, కృష్ణవేణి, సరస్వతి, నాగలక్ష్మితోపాటు స్వామివారి భక్తబృందం పాల్గొన్నారు.



స్వామివారికి పొంగళ్లు సమర్పించేందుకు ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

అరుదైన బ్లడ్‌గ్రూపుల వారి సేవలు నిత్యం అవసరం

- ఐఎంఏ భవనంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం
- ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, డీఐ సునీత
- రక్తదానం చేసిన 36 మంది యువతీ యువకులు
- ఆరోగ్యంగా ఉన్నవారు ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చు..



దాతలతో ఎమ్మెల్యే చదలవాడ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సునీత, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి

నరసరావుపేట: అరుదుగా దొరికే ఓ నెగటివ్, బి నెగిటివ్, ఏబీ నెగిటివ్ వంటి బ్లడ్ గ్రూపుల వారి వివరాలను సేకరించి రిజిస్టర్ చేసి అత్యవసర సమయాలలో వారిని సంప్రదించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మార్గదర్శకత్వంలో ది నరసరావుపేట తాలూకా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ అసోసియేషన్ సహకారంతో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఎ) హాలులో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ చదలవాడ, పల్నాడు జిల్లా డ్రగ్స్ కంట్రోలర్ ఆఫీసర్ డి.సునీత హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాలూకా కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వారు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం మంచి విషయమని అన్నారు. తాము పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి బ్లడ్ బ్యాంకుకు తమ వంతు సహకారాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా డ్రగ్స్ కంట్రోలర్ ఆఫీసర్ సునీత మాట్లాడుతూ రక్తం అనేది కృత్రిమంగా ఫ్యాక్టరీలలో తయారయ్యేది కాదని. కేవలం మనుషులు నుండి సేకరించి ఆపదలో ఉన్నవారికి అందించాల్సి వుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహనరెడ్డి మాట్లాడుతూ వేసవి కారణంగా బ్లడ్ బ్యాంకులో రక్త నిలువలు తక్కువగా ఉన్నాయని, డ్రగ్స్ కంట్రోలర్ ఆఫీసర్ సునీతను రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయాలని కోరగా వారు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వారి సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేయించారన్నారు. అందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని అన్నారు. ఆపరేషన్ సిందూర యుద్ధభూమిలో గాయపడ్డ సైనికులు సహాయం చేయగల సంస్థ రెడ్‌క్రాస్ మాత్రమేనని అన్నారు. యుద్ధం జరుగుతున్న సందర్భంలో రెడ్‌క్రాస్ నేషనల్ హెడ్ క్వార్టర్స్ నుంచి దేశవ్యాప్తంగా ఉన్న రెడ్‌క్రాస్ అంబులెన్స్‌లు సిద్ధం చేయాలని సూచించారన్నారు. రక్తదానం చేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. రెడ్‌క్రాస్ కోశాధికారి గంటకోట మురళీకృష్ణ మాట్లాడారు. మొత్తం 36 మంది రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారందరికీ ముఖ్యఅతిథులు ప్రశంసాపత్రాలు అందజేశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కొత్తమాసు మెహర్‌బాబు, అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, సెక్రెటరీ పీవీఎస్ మోహన్, ఎస్ఎస్‌వీ ప్రవీణ్, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసగుప్తా, డాక్టర్ సృజన, సాంబశివరావు, చంద్రశేఖరరావు, బీవీఎల్ ప్రసాద్, బ్లడ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మురళీధర్, మాజీ కౌన్సిలర్ మస్తాన్‌వలి, తాలూకా అసోసియేషన్ మెంబర్స్, రెడ్ క్రాస్ సిబ్బంది, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘననివాళి

రొంపిచర్ల: భారత్–పాక్ యుద్ధంలో అమరులైన వీర జవాన్లకు రొంపిచర్ల గ్రామంలోని స్థానిక చెరువుకట్ట సెంటర్లో ఆదివారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామపెద్దలు, గ్రామస్తులు యుద్ధంలో మృతి చెందిన సత్యసాయి జిల్లాకు చెందిన అమరవీరుడు మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరులైన వీరజవాన్లకు జోహార్, ఉగ్రవాదం నశించాలి, పాకిస్థాన్ ఖబడ్దార్, జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల దాడిలో 26 మంది భారతీయులు మృతి చెందారన్నారు. దీనికి ప్రతీకారంగా మనదేశం 'ఆపరేషన్ సిందూర్' కార్యక్రమంలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసిందన్నారు. ఇరుదేశాలకు జరిగిన భీకర పోరులో మన దేశానికి చెందిన వీరజవాన్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మురళీనాయక్, మరి కొందరు జవాన్లు మృతి చెందడం బాధాకరమన్నారు. మృతి చెందిన వీరజవాన్ల కుటుంబాలకు దేశ ప్రజలు అండగా ఉంటారన్నారు. సరికొండ వెంకటేశ్వరరాజు, పడాల వెంకిరెడ్డి, రామిరెడ్డి, పిడెం హుస్సేన్, సరికొండ తిమ్మరాజు, చక్రవరం సత్యం రాజు, ముక్కడాల వెంకటేశ్వరరావు, చక్రవరం బలరామరాజు, పసుమర్తి ఆదినారాయణ, గొడవర్తి వెంకటేశ్వర్లు, గరికపాటి తాతయ్య, గాడిపర్తి వెంకటకోటయ్య, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పలు పార్టీల, ప్రజా సంఘాల నాయకులు



జాతీయజెండాతో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

వీరజవాన్‌కు ఘననివాళి

బొల్లాపల్లి: భారత్ – పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం చెందిన భరతమాత ముద్దుబిడ్డ, మురళీనాయక్ కుటుంబానికి సంతాపం తెలియజేస్తూ మండలంలోని సరికొండపాలెం తండాకు చెందిన యూత్ సభ్యులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా తండావాసులు మాట్లాడుతూ దేశంకోసం బంజారా జాతిముద్దుబిడ్డ వీరమరణం చెందడం గర్వకారణమన్నారు. మురళీనాయక్ ఆశయాలకు అనుగుణంగా యువకులు దేశసేవలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తండావాసులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

నరసరావుపేట ఈస్ట్: నృసింహ జయంతిని పురస్కరించుకొని ఆదివారం శ్రీయోగానంద నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా శ్రీమరకత రాజ్యలక్ష్మీ అమ్మవారి ఆలయ శిఖర నిర్మాణానికి భక్తులు భారీగా విరాళాలు అందించారు. పట్టణానికి చెందిన సోదరులు నిడమానూరి సురేంద్రబాబు, కల్యాణి, వెంకటశివరాంప్రసాద్, కన్య దంపతులు రూ.6 లక్షలు, భవిరిశెట్టి రామారావు, నాగమణికుమారి దంపతులు రూ.1,00,116 అందజేశారు.

పీఆర్‌సీ, డీఏ విడుదల చేయాలి



నాదెండ్ల: కూటమి ప్రభుత్వం పీఆర్‌సీ, డీఏలు ఎప్పుడు ఇస్తుందో ఉపాధ్యాయులు ఎదురు చూసే రోజులు ఏర్పడ్డాయని భారత రాజ్యాంగ పరిరక్షణసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. నాదెండ్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పౌరులకు ప్రభుత్వాలు అందించే పౌరసేవలు ఎన్నో ఉన్నా, అన్ని రకాల సేవలు ప్రజలకు అందించేది ప్రభుత్వ ఉద్యోగులేనన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల కోసం ఎన్ని అప్పులు చేసినా ప్రతి ఆరు నెలలకోసారి డీఏ క్రమం తప్పకుండా ఇస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇప్పటివరకూ మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే విడుదల చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా ఉపాధ్యాయులకు చెల్లించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగికి ప్రతి పదేళ్లకోసారి వేతన సవరణ అనేది రాజ్యాంగ, చట్టబద్ధమైందన్నారు. ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి రిపోర్టు వచ్చే వరకూ 30 శాతం ఐఆర్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కె.విజయ్‌కుమార్, జి అనిల్‌కుమార్ ఉన్నారు.

మెగా కంటి శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

దాచేపల్లి: నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ది మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైవీడీ ప్రసాద్ ప్రారంభించారు. పెదకాకాని శంకర కంటి వైద్యశాల వైద్యుల బృందం ఈ శిబిరంలో పాల్గొని 1120 మంది రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. వీరిలో 750 మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్సలు చేయాలని నిర్ధారించారు. కంటి సమస్యతో బాధపడుతున్న కొంతమందికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో పాల్గొన్నవారందరికి ఉచిత అన్నదానం చేపట్టారు. ది మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 8వ విడత ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమని, పల్నాడు ప్రాంతంలో ఎంతోమంది నిరుపేదలకు ఈ వైద్యశిబిరం ఎంతగానో ఉపయోగపడిందని రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ చెప్పారు. సామాజిక సేవా దృక్పథంతో ది మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు నిరుపేదలకు అండగా ఉన్నాయని, మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమం సంస్థ వ్యవస్థాపకులు నాగెండ్ల సుమతీరత్నం, స్థానికులు మాతంగి రాంబాబు, నాగెండ్ల ఏసయ్య, జయనందరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ చేతులు పంపిణీ



కృత్రిమ చేతులను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ సభ్యులు

పిడుగురాళ్ల: దివ్యాంగులకు కృతిమ చేతులను రోటరీ క్లబ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రమాదవశాత్తు చేతులు కోల్పోవడం, లేక యాక్సిడెంట్ వలన చేతులు లేని దివ్యాంగులకు ఉచిత కృత్రిమ చేతలను రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, ఈఎల్ఎల్ఈఎన్ ఫౌండేషన్ యూఎస్ఏ సహకారంతో గ్లోబల్ అంబాసిడర్ కేవీ మోహన్ చేతుల మీదగా 45 కృతిమ చేతులను అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదుగురు రెండు చేతులు, మిగిలిన వారికి ఒక చెయ్యి అందజేయటం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు గుండా అశోక్, మంగళగిరి రోటరీ క్లబ్ ప్రతినిధులు చక్రవర్తి, గాజుల శ్రీనివాసరావు, అందే మురళి, పిడుగురాళ్ల రోటరీ క్లబ్ సభ్యులు డాక్టర్ పంగులూరి విష్ణుబాబు, సెక్రటరీ నీరుమళ్ల రాజేష్, కోశాధికారి డాక్టర్ కృష్ణకాంత్, కోట రమేష్, గర్రె సుబ్రహ్మణ్యం, జూజ్జురు మురళి, మసుమర్తి రమేష్, ముత్తా రెడ్డి, గంధం హరికృష్ణ, గుండా శ్రీను, కాకుమాను శ్రీనివాసరావు, వంకాయల గోపీ, బావనాసి నరసింహారావు, ఏలూరు పుల్లారావు, పాపాయి గుప్తా, ఆత్మకూరు గురవయ్య, కోలిశెట్టి శ్రీను, అమీర్ అలీ, మాచర్ల శ్రీనివాసరావు, మౌలా సాహెబ్, వీవీఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

వైభవంగా శివయ్య రథోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట ఈస్ట్: పాతూరులో వేంచేసియున్న శ్రీగంగా పార్వతి సమేత శ్రీ భీమలింగేశ్వరస్వామి వారి నగరోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో శనివారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించి ఆదివారం ఉదయం నగరోత్సవం జరిపారు. నూతనంగా నిర్మించిన రథంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి పట్టణ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆలయ ఈఓ శ్యామల రఘునాథరెడ్డి పచ్చజెండా ఊపి రథోత్సవం ప్రారంభించారు. దాదాపు 50 సంవత్సరాల తరువాత నిర్వహించిన రథోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని రథాన్ని తమ స్వహస్తాలతో పురవీధుల్లో తిప్పారు. మహిళల కోలాటాలు, భజనలు, గంగిరెద్దుల ప్రదర్శన, కేరళ వాయిద్యాలతో రథోత్సవం కోలాహలంగా కొనసాగింది. కార్యక్రమంలో మున్సిపల్ మాజీచైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, మద్ది బాలసుబ్రమణ్యం, గట్టుపల్లి సత్యనారాయణ, చేగు వెంకటేశ్వరరావు, పూజల చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'అన్నదాత సుఖీభవ'

ఏడీఏ బోయపాటి రవిబాబు

శావల్యాపురం: అర్హత కల్గియున్న రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా చర్యలు చేపట్టినట్లు ఏడీఏ బోయపాటి రవిబాబు ఆదివారం తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతు ఖాతాకు రూ.20వేలు నగదు ప్రభుత్వం నేరుగా జమ చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉండగా ప్రస్తుతం రైతుసేవా కేంద్రాల్లో రైతులు తమ ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాలు జిరాక్స్‌లు అందజేసి అప్రూవల్ చేయించిన తదుపరి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. వినుకొండ రూరల్‌లో 18,898, శావల్యాపురం మండలం 12, 559, ఈపూరు మండలం 15,139, బొల్లాపల్లి మండలం 17,988, నూజెండ్ల మండలంలో 18,300 మంది రైతుల సమగ్ర వివరాలు రైతుసేవా కేంద్రాల్లో ప్రచురణ చేసినట్లు తెలిపారు. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో ప్రాథమిక విచారణ జరుగుతుందన్నారు. ఒక కుటుంబానికి ఒకరు మాత్రమే అర్హత పొందుతారన్నారు. ఈనెల 20లోపు ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం పూర్తి చేసి తుది నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లించే వారు, విశ్రాంత ఉద్యోగులు రూ.10వేలు దాటిన వేతనం పొందేవారు, లాయర్లు, డాక్టర్లు, ఇంజినీర్లు తదితర వారందరూ ఈ పథకానికి అనర్హులన్నారు. వెబ్ ల్యాండ్‌లో భూమి కల్గిన రైతులు, అటవీశాఖ భూములు సాగు చేసే రైతుల జాబితాను మాత్రమే వేరిఫికేషన్ చేస్తున్నట్లు తెలిపారు.

'షేర్ ద విజన్' సేవలు అభినందనీయం

మండల విద్యాశాఖాధికారి–1 శ్రీనివాసరావు



నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: తెలంగాణ రాష్ట్రం ఖమ్మం ఏరియాకు చెందిన షేర్ ద విజన్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని సత్తెనపల్లి మండల విద్యాశాఖాధికారి–1 ఎ.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సాధన అనాథ వృద్ధాశ్రమానికి షేర్ ద విజన్ సంస్థ మూడు నెలలకు సరిపడా నిత్యావసరాలు, మంచాలు, బెడ్లు, కూలర్, మిక్సీ, సీలింగ్ ఫ్యాన్‌లు, టేబుల్ ఫ్యాన్‌లు, గీజర్, దుస్తులు, దుప్పట్లు ఆదివారం అందించింది. ఎంఈఓ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ ఎంతో ఉదారంగా చేస్తున్న సేవలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఈ సంస్థ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. షేర్ ద విజన్ సంస్థ ప్రెసిడెంట్ నారాయణ మాట్లాడుతూ తాము సేవా కార్యక్రమాలను కరోనాకు ముందు నుంచి చేస్తున్నామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అనేక అనాథ ఆశ్రమాలకు కావలసిన సామగ్రిని అందజేస్తున్నామన్నారు. భవిష్యత్తులో కూడా అనాథాశ్రమాలకు మరింత అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థ ప్రెసిడెంట్ నారాయణ, ఎంఈవో–1 ఎ.శ్రీనివాసరావులను సాధన అనాథ వృద్ధాశ్రమ అధినేత బక్కా సురేష్ బాబు సన్మానించారు. కార్యక్రమంలో షేర్ ద విజన్ సంస్థ సభ్యులు, సాధన అనాథ వృద్ధాశ్రమ వాసులు, పాల్గొన్నారు.